వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 05 | సంచిక : 100
పేజీలు : 04 | వెల: రూ.5/-
బుధవారం
ఏప్రిల్ 08, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


4లో..

- కుటుంబ సమేతంగా స్వామివారికి అభిషేకం
- అమ్మవారి కుంకుమార్చనలో పాల్గొన్న మంత్రి
- అధికారిక లాంఛనాలతో స్వాగతం పలికిన ఆలయ అధికారులు

## శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న మంత్రి కొండా సురేఖ

# ట్రంప్ యుద్ధోన్మాదం!


2లో..

- బలైన ప్రపంచ దేశాలు
- అమెరికా, ఇజ్రాయెల్ మొండి వైఖరి
- కుప్పకూలిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ
- ముడిచమురు సెగతో విలవిల్లాడుతున్న సామాన్యుడు
- తాత్కాలిక వాయిదా కాదు..
- యుద్ధానికి బేషరతుగా ముగింపు పలకాలి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూల యుద్ధ కాంక్ష నేడు ప్రపంచాన్ని పెను సంక్షోభంలోకి నెట్టివేసింది. ఇరాన్‌ను సర్వనాశనం చేయాలన్న వారి వ్యూహం బెడిసికొట్టడమే కాకుండా, భూగోళంపై ఉన్న అన్ని దేశాల ఆర్థిక మూలాలను దెబ్బతీసింది. ఇరాన్ అధినేత ఖమేనీని అంతమొందించి, ఆ దేశంపై బాంబుల వర్షం కురిపించి సాధించింది శూన్యమని, ఈ విధ్వంసానికి ట్రంప్ ప్రథమ దోషిగా నిలుస్తారని విశ్లేషకులు మండిపడుతున్నారు. ఇరాన్ తన ఆత్మరక్షణ కోసం హార్ముజ్ జలసంధిని మూసివేయడంతో ప్రపంచ చమురు రవాణా స్తంభించిపోయింది. ప్రపంచ చమురు అవసరాల్లో 20 శాతం ఇక్కడి నుంచే సరఫరా అవుతున్న నేపథ్యంలో, రవాణా నిలిచిపోవడంతో చమురు ధరలు ఆకాశాన్ని తాకాయి. ఫలితంగా విమాన ప్రయాణాలు రద్దయ్యాయి, రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసరాల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరాయి.

వరంగల్ వాయిస్, స్పెషల్ డెస్క్ :

## సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికీ చేరాలి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- పేదింటి ఆడబిడ్డలకు 'కళ్యాణ లక్ష్మి' కొండంత అండ
- భీమారం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే


4లో..

## వడ్డేపల్లి అభివృద్ధికి కట్టుబడి ఉన్నా


2లో..

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన
- పదేళ్ల నిర్లక్ష్యం వీడి.. ప్రగతి పథంలోకి..


4లో..

## తల్లీబిడ్డల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ సత్య శారద
- ఘనంగా 'సురక్షిత మాతృత్వ దినోత్సవం'
- గర్భిణీలతో మాట్లాడిన ఎమ్మెల్యే, కలెక్టర్

## పోలీస్ స్టేషన్లలో రికార్డులు పక్కాగా ఉండాలి


2లో..

- సీపీ సన్ ప్రీత్ సింగ్
- ముల్కనూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ
- రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలి

# బినామీల వసూళ్లతో జాగ్రత్త!

- శ్రీ అగర్వాల్ ఎంటర్ప్రైజెస్ ఖాతాదారులకు హెచ్చరిక
- శ్రీ అవికా ఏజెన్సీస్‌తో మాకు సంబంధం లేదు
- యజమాని దేవా లత వెల్లడి

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ప్రముఖ వ్యాపార సంస్థ శ్రీ అగర్వాల్ ఎంటర్ప్రైజెస్ పేరుతో జరుగుతున్న అక్రమ వసూళ్ల పట్ల ఖాతాదారులు, వ్యాపార వర్గాలు అప్రమత్తంగా ఉండాలని ఆ సంస్థ ప్రస్తుత యజమాని దేవా లత ఒక ప్రకటనలో హెచ్చరించారు. సంస్థ యాజమాన్య మార్పు, ప్రస్తుత లావాదేవీల విషయంలో నెలకొన్న వివాదాలపై ఆమె స్పష్టతనిచ్చారు. గతంలో ఈ సంస్థలో పలువురు భాగస్వాములు ఉన్నప్పటికీ, వారంతా తప్పుకున్న తర్వాత నిమతి సాయి తేజ, దేవా లత భాగస్వాములుగా కొనసాగారు. అయితే, మే 25, 2025న సాయి తేజ మరణించడంతో, అప్పటి నుంచి దేవా లత సంస్థకు ఏకైక యజమానిగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా రావుల రామకృష్ణ అనే వ్యక్తి శ్రీ అవికా ఏజెన్సీస్ అనే సంస్థను స్థాపించి, దానిని శ్రీ అగర్వాల్ ఎంటర్ప్రైజెస్ బినామీ సంస్థగా చిత్రీకరిస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని దేవా లత తెలిపారు. ఈ రెండు సంస్థల మధ్య వివాదం ప్రస్తుతం న్యాయస్థానంలో విచారణలో ఉందని, శ్రీ అవికా ఏజెన్సీస్‌తో తమకు ఎటువంటి సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు. సంస్థతో సంబంధం లేని వ్యక్తులు వసూళ్లకు వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ నగదు రూపంలో డబ్బు ఇవ్వవద్దు. అలా ఇస్తే సంస్థ బాధ్యత వహించదు. బకాయిలను కేవలం శ్రీ అగర్వాల్ ఎంటర్ప్రైజెస్ పేరు మీద ఉన్న చెక్కు రూపంలో మాత్రమే చెల్లించాలని కోరారు.సంస్థ జీఎస్టీ నంబర్, బ్యాంక్ అకౌంట్ నంబర్లలో ఎటువంటి మార్పు లేదు. కేవలం యాజమాన్య బాధ్యతలలో మార్పు జరిగినట్లు గుర్తించాలని కోరారు. గత భాగస్వామి మనీష్ కుమార్ అగర్వాల్, గత మేనేజర్ రిషబ్ అగర్వాల్‌లకు మాత్రమే సంబంధిత గ్రూపుల్లో సభ్యులను చేర్చే అధికారం ఉందని, దీనికి సంబంధించిన ఆధార పత్రాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. వ్యాపార వర్గాలు ఈ మోసపూరిత వసూళ్ల పట్ల జాగ్రత్తగా ఉండి, తమకు సహకరించాలని దేవా లత విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలు లేదా సందేహాల కోసం నేరుగా యజమానిని 9246898035 నంబర్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

# ట్రంప్ యుద్ధోన్మాదం!

- బలైన ప్రపంచ దేశాలు
- అమెరికా, ఇజ్రాయెల్ మొండి వైఖరి
- కుప్పకూలిన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ
- ముడిచమురు సెగతో విలవిల్లాడుతున్న సామాన్యుడు
- తాత్కాలిక వాయిదా కాదు..
- యుద్ధానికి బేషరతుగా ముగింపు పలకాలి

**వరంగల్ వాయిస్, స్పెషల్ డెస్క్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూల యుద్ధ కాంక్ష నేడు ప్రపంచాన్ని పెను సంక్షోభంలోకి నెట్టివేసింది. ఇరాన్‌ను సర్వనాశనం చేయాలన్న వారి వ్యూహం బెడిసికొట్టడమే కాకుండా, భూగోళంపై ఉన్న అన్ని దేశాల ఆర్థిక మూలాలను దెబ్బతీసింది. ఇరాన్ అధినేత ఖమేనీని అంతమొందించి, ఆ దేశంపై బాంబుల వర్షం కురిపించి సాధించింది శూన్యమని, ఈ విధ్వంసానికి ట్రంప్ ప్రథమ దోషిగా నిలుస్తారని విశ్లేషకులు మండిపడుతున్నారు. ఇరాన్ తన ఆత్మరక్షణ కోసం హార్ముజ్ జలసంధిని మూసివేయడంతో ప్రపంచ చమురు రవాణా స్తంభించిపోయింది. ప్రపంచ చమురు అవసరాల్లో 20 శాతం ఇక్కడి నుంచే సరఫరా అవుతున్న నేపథ్యంలో, రవాణా నిలిచిపోవడంతో చమురు ధరలు ఆకాశాన్ని తాకాయి. ఫలితంగా విమాన ప్రయాణాలు రద్దయ్యాయి, రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసరాల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరాయి.

## డాలర్ ఆధిపత్యానికి సామాన్యుల బలి:

ముడిచమురుపై పట్టు సాధించి, డాలర్ సర్వాధిపత్యాన్ని కాపాడుకోవాలన్న అమెరికా స్వార్థం ఆసియా దేశాల కరెన్సీ విలువలను పాతాళానికి తొక్కేసింది. సంపన్న దేశాల కంటే మూడవ ప్రపంచ దేశాల్లో ద్రవ్యోల్బణం తీవ్రస్థాయికి చేరింది. ప్రజల కొనుగోలు శక్తి హరించుకుపోవడంతో ప్రపంచం ఆర్థిక మాంద్యం కోరల్లో చిక్కుకుంది. చమురు కొరతతో ఎరువుల ఉత్పత్తి దెబ్బతిని, ఆహార భద్రతకు ముప్పు వాటిల్లింది. ముఖ్యంగా శ్రామిక ప్రజానీకం ఆకలి కోరల్లో చిక్కుకోవడం ట్రంప్ సాధించిన ‘ఘనత’గా చరిత్రలో నిలిచిపోనుంది.

## సామ్రాజ్యవాదానికి గట్టి పాఠం:

వెనిజులా తరహాలోనే ఇరాన్‌ను కూడా సులభంగా లొంగదీసుకోవచ్చని భావించిన ట్రంప్‌కు ఈ పరిణామాలు గట్టి పాఠం నేర్పాయి. తన తొత్తు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని చూసిన అమెరికా ప్రయత్నం బెడిసికొట్టింది. ప్రస్తుతం రెండు వారాల పాటు యుద్ధాన్ని వాయిదా వేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించినప్పటికీ, అది తాత్కాలికం మాత్రమే కాకూడదని, శాశ్వత యుద్ధ విరమణ ప్రకటించి నష్టపోయిన దేశాల పునర్నిర్మాణంలో పాల్గొనాలని ప్రపంచ దేశాలు డిమాండ్ చేస్తున్నాయి. చమురు–డాలర్ ప్రాబల్యాన్ని నిలబెట్టుకోవడం కోసం రాజకీయ ఆధిపత్య పోరుకు తెరలేపిన అమెరికా ఇప్పటికైనా కళ్లు తెరవాలి. చట్టవిరుద్ధమైన, అనైతికమైన ఈ యుద్ధోన్మాదం నుంచి బయటపడాలి. ప్రపంచ శాంతిని, స్థిరత్వాన్ని పణంగా పెట్టి సాగిస్తున్న ఈ దాడులు ఆగిపోవాలని, బేషరతుగా శాంతి చర్చలకు అడుగులు పడాలని యావత్ ప్రపంచం కోరుకుంటోంది.

# పోలీస్ స్టేషన్లలో రికార్డులు పక్కాగా ఉండాలి

- సీపీ సన్ ప్రీత్ సింగ్
- ముల్కనూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ
- రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలి

**వరంగల్ వాయిస్, ముల్కనూర్:** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ బుధవారం ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఆయన, అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. స్టేషన్‌లోని రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసి, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని, “అరైవ్ అలివ్” కార్యక్రమం ద్వారా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలని, డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది నిరంతరం గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, పాత నేరస్తులు, హిస్టరీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడకూడదని, బాధితులు స్టేషన్‌కు వచ్చినప్పుడు వారి సమస్యలను సానుకూలంగా విని తక్షణ పరిష్కారం చూపాలని సీపీ సూచించారు.సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ముల్కనూర్ ఎస్ఐ రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వడ్డేపల్లి అభివృద్ధికి కట్టుబడి ఉన్నా

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన
- పదేళ్ల నిర్లక్ష్యం వీడి.. ప్రగతి పథంలోకి..

**వరంగల్ వాయిస్, వడ్డేపల్లి :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని వడ్డేపల్లి ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, నగరంలోని ప్రధాన కాలనీలకు దీటుగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం 60వ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లిలో బల్దియా మేయర్ గుండు సుధారాణితో కలిసి ఆయన పలు అంతర్గత రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పదేళ్ల పాలనలో వడ్డేపల్లి తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించి, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. “గతంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు ఉన్నప్పటికీ నిధులు ఇవ్వకుండా వివక్ష చూపారు. కానీ, ప్రస్తుతం ప్రజా పాలనలో రాజకీయాలకు తావు లేకుండా అన్ని డివిజన్లకు సమానంగా నిధులు కేటాయిస్తున్నాం” అని ఆయన పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల కార్పొరేటర్లు ఉన్న వార్డుల్లో కూడా అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని వివరించారు. గ్రామీణ వాతావరణం కలిగిన వడ్డేపల్లి, శాయంపేట, సోమిడి ప్రాంతాల్లో దవాఖానలు, స్మశాన వాటికలు, అంతర్గత రహదారులు, సైడ్ డ్రైనేజీల వంటి మౌలిక సదుపాయాలను దశలవారీగా మెరుగుపరుస్తున్నట్లు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల కాలంలోనే నిధుల కొరత లేకుండా వేగంగా పనులు చేపడుతున్నామని, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, బల్దియా అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# మాతృ, శిశు మరణాల నివారణే లక్ష్యం

- లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ రద్దు
- ములుగులో ప్రత్యేక వర్క్‌షాప్

**వరంగల్ వాయిస్, ములుగు :** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ‘హెల్త్ వీక్’ను పురస్కరించుకొని ములుగు జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో “సురక్షిత మాతృత్వం, లింగ నిర్ధారణ నిరోధక చట్టం” పై భారీ వర్క్‌షాప్ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య నిపుణులు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ గోపాల్ రావు మాట్లాడుతూ.. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, అటువంటి పనులకు పాల్పడే ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్‌ను తక్షణమే రద్దు చేయడమే కాకుండా చట్టరీత్యా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ప్రమాద సూచికలున్న గర్భిణీలను ముందస్తుగా గుర్తించి ప్రత్యేక వైద్య సేవలు అందిస్తే మాతృ, శిశు మరణాలను అరికట్టవచ్చన్నారు.




జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించారు. స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ.. గుండె సంబంధిత వ్యాధులున్న గర్భిణీలు ముందస్తుగా ఆసుపత్రిలో చేరాలని, ఆరోగ్య కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సరైన ప్రణాళికతో ఉండాలని సూచించారు. అనంతరం ప్రసూతి తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డాక్టర్ నిరంజని వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ నాగ అనీష్, డాక్టర్ రంజిత్, మాస్ మీడియా అధికారి సంపత్, సూపర్వైజర్ వెంకట్ రెడ్డి, అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులు, ములుగు మెడికల్ కాలేజ్ విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

# తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

**వరంగల్ వాయిస్, గణపురం:** మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు నాయకపు రఘుపతి గౌడ్ ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి జారి పడి తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం తన దైనందిన వృత్తిలో భాగంగా చెట్టు ఎక్కుతుండగా కాలు జారి కింద పడటంతో ఈ ప్రమాదం సంభవించింది. గమనించిన తోటి కార్మికులు వెంటనే ఆయన్ని చికిత్స నిమిత్తం భూపాలపల్లిలోని వంద పడకల ఆసుపత్రికి తరలించారు.



# 28న పరకాలలో 'హిందూ సమ్మేళనం'



**వరంగల్ వాయిస్, పరకాల:** పరకాల పట్టణ చరిత్రలో నిలిచిపోయేలా ఈ నెల 28న భారీ 'హిందూ సమ్మేళనం' నిర్వహించనున్నట్లు హిందూ సమ్మేళన జాగరణ సమితి ప్రకటించింది. శనివారం పట్టణంలోని కుంకుమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సమితి గౌరవ అధ్యక్షులు డాక్టర్ నాగబండి విద్యాసాగర్ అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖుల సమక్షంలో ఈ నెల 28న సమ్మేళనాన్ని ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. హిందూ ధర్మ రక్షణ, సామాజిక ఐక్యత లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భావితరాలకు ఆదర్శంగా, పరకాల చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకొని ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అందరి లక్ష్యం ఒక్కటేనని, ముక్తకంఠంతో హిందూ సమ్మేళన విజయానికి కృషి చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ సన్నాహక సమావేశంలో సమితి అధ్యక్షులు కొలుగూరి రాజేశ్వరరావు, సహ అధ్యక్షుడు మాడుగుల పాపిరెడ్డి, ప్రధాన కార్యదర్శి దుప్పటి సాంబశివుడు, కోశాధికారి యుగంధర్ శర్మ, కౌన్సిలర్లు బండి శ్రీధర్, ఆకుల శ్రీధర్, రమేష్, పూర్ణాచారి, మాజీ వైస్ చైర్మన్ జయపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మేఘనాథ్, జయంతి లాల్, వెన్నంపల్లి పాపన్న, ఎర్ర రామన్న,హిందూ బంధువులు పాల్గొన్నారు. సమావేశానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ హిందూ సమ్మేళన జాగరణ సమితి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడి



**వరంగల్ వాయిస్, మల్హర్:** భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండల పరిధిలో అక్రమ గుడుంబా తయారీదారులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు కొయ్యూరు ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం మెరుపు దాడులు నిర్వహించారు. మండలంలోని కొండంపేట గ్రామంలో అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో అదే గ్రామానికి చెందిన కొరకాని సమ్మయ్య (40) పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి 20 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్న పోలీసులు, తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లం పానకాన్ని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అదేవిధంగా, గ్రామానికి చెందిన చీర్ల రాజేశ్వరి (50) గుడుంబా తయారు చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, 50 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. నిందితులిద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా కొయ్యూరు ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ.. మండలంలో అక్రమ గుడుంబా తయారీ, విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉన్నట్లయితే వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించాలని ఆయన కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.

## సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** రెవెన్యూ సేవలను ప్రజలకు వేగవంతంగా అందించాలని, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని ఆర్డీఓ టి.సుమ అధికారులను ఆదేశించారు. బుధవారం 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మండల తహశీల్దార్ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా కార్యాలయంలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆర్డీఓ, పెండింగ్‌లో ఉన్న ఫైళ్లు మరియు పట్టాదారు పాస్ పుస్తకాల జారీ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యల కోసం కార్యాలయాల చుట్టూ పదేపదే తిరగాల్సిన అవసరం లేకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా, సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం కార్యాలయ ఆవరణలో వేచి ఉన్న రైతులతో ఆర్డీఓ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల వినతులపై సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటస్వామి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వాములకు భిక్ష అందించిన ముస్లిం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** కులం, మతం కంటే మానవత్వం గొప్పదని, సమాజంలో సోదరభావం వెల్లివిరియాలని పర్వతగిరి మండలం ఏనుగల్లు గ్రామానికి చెందిన మహమ్మద్ రహీమ్ చాటి చెప్పారు. మత సామరస్యానికి ప్రతీకగా ఆయన గ్రామంలో ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో దీక్షలో ఉన్న సుమారు 50 మంది హనుమాన్ స్వాములకు మహమ్మద్ రహీమ్ స్వయంగా భిక్ష అందించారు. భక్తిశ్రద్ధలతో స్వామీజీలను ఆహ్వానించి, వారికి అన్నదానం చేయడం ద్వారా గ్రామస్తుల మనసు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

# వెంకటాపూర్ అసైన్డ్ భూమిని పేదలకు పంచాలి

- కలెక్టరేట్ ఎదుట సీపీఐ ధర్నా
- భూకబ్జాదారులను అరెస్ట్ చేయాలని డిమాండ్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఐనవోలు మండలం వెంకటాపూర్ గ్రామంలో అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకుని, అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వెంకటాపూర్ గ్రామ రైతులు, పేదలు చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జిల్లావ్యాప్తంగా చట్టవిరుద్ధంగా అసైన్డ్ భూములను కొందరు భూబకాసురులు ఆక్రమించుకుంటున్నారని శ్రీనివాసరావు మండిపడ్డారు. రెవెన్యూ అధికారుల అండదండలతోనే పేదల భూములు అన్యాక్రాంతమవుతున్నాయని ఆరోపించారు. వెంకటాపూర్ అసైన్డ్ భూములను ఆక్రమించిన కబ్జాదారులపై కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేసి, వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. హసన్ పర్తి మండలం ముచ్చర్ల గ్రామంలో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న అసైన్డ్ భూమిని కూడా వెంటనే పేదలకు పంచాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, జిల్లా నాయకులు ఏదునూరి వెంకట్రాజం, కొట్టెపాక రవి, మునిగాల భిక్షపతి, కర్రె లక్ష్మణ్, అలువాల రాజు, పద్మ, మాలోతు శంకర్, యాకూబ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం



**వరంగల్ వాయిస్, దామెర:** మండల పరిధిలోని లాదెళ్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆర్థిక చేయూత లభించింది. ఈ విగ్రహ నిర్మాణానికి బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంచార్జి, రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ చందర్ రెడ్డి తనవంతు సహాయంగా రూ.20,000 విరాళాన్ని ప్రకటించారు. విజయ చందర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆయన ప్రతినిధులు ఈ నగదును విగ్రహ కమిటీ సభ్యులకు అందజేశారు. సమాజానికి అంబేద్కర్ చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయ సాధనలో భాగంగా ఈ విగ్రహావిష్కరణకు తమవంతు మద్దతు తెలుపుతున్నట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల రమేష్, బూత్ అధ్యక్షులు అన్నబోయిన రోహిత్, జక్కుల శ్రీకాంత్, బత్తుల సుమంత్ సంఘాల సాంబరాజు, డెంగు నవీన్, ననబోయిన శ్రీనివాస్, విగ్రహ కమిటీ సభ్యులు సంఘాల భరత్, కుమార్, చింతం సుధాకర్, రాజు, తానేషా పాల్గొన్నారు.

## ఘనంగా విజయ చందర్ రెడ్డి జన్మదిన వేడుకలు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ చందర్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం హనుమకొండలోని రెడ్ క్రాస్ భవనంలో వైభవంగా జరిగాయి. రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు, పరకాల నియోజకవర్గ కార్యకర్తల సమక్షంలో ఈ సంబరాలు నిర్వహించారు. ముందుగా రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు విజయ చందర్ రెడ్డికి పూలమొక్కలు అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. రెడ్ క్రాస్ సిబ్బందితో పాటు పరకాల నియోజకవర్గ కార్యకర్తలు ఆయనను కలిసి బొకేలు అందించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాలకవర్గ సభ్యులు డాక్టర్ కె.సుధాకర్ రెడ్డి, డాక్టర్ యం.శేషుమాదవ్, డాక్టర్ సంధ్యారాణి, రెడ్ క్రాస్ డాక్టర్లు జె.కిషన్ రావు, మొహమ్మద్ తహర్ మసూద్, కొగిల్వాయి గ్రామ ప్రతినిధి చుక్క వనిత మహేందర్, గురజాల శ్రీరామ్ రెడ్డి, జంగిలి నాగరాజు, మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి (ఆత్మకూరు), రాజ్ కుమార్ (పరకాల రూరల్), చంద్రమౌళి (సంగెం), డివిజన్ అధ్యక్షులు ప్రసన్న రాంప్రసాద్, ప్రభాకర్, మొలుగూరి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## వేలేరులో ఉచిత వైద్య శిబిరం



**వరంగల్ వాయిస్, వేలేరు :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు 'టీబీ ముక్త్ భారత్' (క్షయ రహిత భారత్) కార్యక్రమంలో భాగంగా వేలేరు మేజర్ గ్రామపంచాయతీ ఆవరణలో బుధవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రధానంగా క్షయ వ్యాధి నిర్ధారణ కోసం అత్యాధునిక పరికరాలతో ఉచితంగా ఎక్స్‌రే తీశారు. ఈ కార్యక్రమానికి వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 120 మందికి వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. బాధితులకు అవసరమైన మందులను పంపిణీ చేయడంతో పాటు, వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వేలేరు మేజర్ గ్రామ ఉప సర్పంచ్ శ్రీకర్, వైద్యాధికారి డాక్టర్ విశాలి, హెచ్.ఈ.ఓ వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్వైజర్లు కుమారస్వామి, ప్రభావతి, హెల్త్ అసిస్టెంట్లు కనకమ్మ, ప్రసాద్, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గురువులే ఉత్తమ సమాజ నిర్మాతలు

### సరళాదేవి సేవలు చిరస్మరణీయం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఐనవోలు ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసి ఇటీవల పదవి విరమణ పొందిన కూచన సరళాదేవి సన్మాన కార్యక్రమం హంటర్ రోడ్డులోని వి.ఎస్. ఆర్ గార్డెన్స్‌లో అత్యంత ఘనంగా జరిగింది. ఆవుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో పలువురు ప్రముఖులు హాజరై సరళా దేవిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ జిల్లా పీఆర్ టీయూ అధ్యక్షులు మందల తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు వృత్తిరీత్యా పదవి విరమణ అనేది ఒక ప్రక్రియ మాత్రమేనని, వారి బోధన, సమాజానికి వారు చేసే మార్గదర్శకత్వం జీవితకాలం కొనసాగుతుందని అన్నారు. మరొక ముఖ్య అతిథి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ అధ్యక్షులు శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. సమాజంలో తల్లిదండ్రుల తర్వాత అత్యంత గౌరవం పొందేది గురువు మాత్రమేనని కొనియాడారు. ఐనవోలు మండల విద్యాశాఖ అధికారి పులి ఆనందం మాట్లాడుతూ.. సరళాదేవి గత 40 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ ఎంతో నిబద్ధతతో విద్యార్థులకు జ్ఞానాన్ని అందించారని, ఆమె సేవలు శ్లాఘనీయమని అన్నారు. సన్మానం అనంతరం ఆమె మాట్లాడుతూ.. తన నాలుగు దశాబ్దాల ప్రయాణంలో తనకు సహకరించిన తోటి ఉపాధ్యాయులకు, అధికారులకు, కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న మంత్రి కొండా సురేఖ

- కుటుంబ సమేతంగా స్వామివారికి అభిషేకం
- అమ్మవారి కుంకుమార్చనలో పాల్గొన్న మంత్రి
- అధికారిక లాంఛనాలతో స్వాగతం పలికిన ఆలయ అధికారులు



**వరంగల్ వాయిస్, శ్రీశైలం:** తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం ఉదయం ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లాలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశైలాన్ని సందర్శించారు. తన కుమార్తె సుస్మిత పటేల్, మనవడు కొండా శ్రేయాన్ష్ మురళీకృష్ణ పటేల్‌తో కలిసి వచ్చిన మంత్రికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో అధికారిక లాంఛనాలతో ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి కొండా సురేఖ తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మల్లికార్జున స్వామి వారికి నిర్వహించిన అభిషేకంలో, భ్రమరాంబ అమ్మవారి కుంకుమార్చన సేవలో వారు పాల్గొన్నారు. అనంతరం ఆలయ వేద పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య మంత్రి కుటుంబానికి వేదాశీర్వచనం అందించారు. ఆలయ ఈఓ ఎం. శ్రీనివాస రావు మంత్రికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి, భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు. దర్శనం అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మల్లన్న ఆశీస్సులు తమ కుటుంబంపై సదా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ముఖ్యంగా తన మనవరాలు శ్రేష్ఠ పటేల్, మనవడు శ్రేయాన్ష్ మురళీకృష్ణ పటేల్‌ల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు ఆమె పేర్కొన్నారు.

## సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికీ చేరాలి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- పేదింటి ఆడబిడ్డలకు 'కళ్యాణ లక్ష్మి' కొండంత అండ
- భీమారం లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

**వరంగల్ వాయిస్, హసన్ పర్తి/భీమారం:** పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లు భారమవ్వకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అందిస్తున్న 'కళ్యాణ లక్ష్మి' పథకం ఆయా కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. బుధవారం హసన్‌పర్తి మండల కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ 55వ డివిజన్ పరిధిలోని భీమారం గ్రామానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా ప్రతి అర్హుడికీ చేరవేస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి తాము నిరంతరం అందుబాటులో ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు గడ్డం శివరాం ప్రసాద్ మాట్లాడుతూ.. 55వ డివిజన్ మరియు భీమారం గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా ప్రత్యేక కృషి చేస్తున్నామని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ నాయకులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్, యూత్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## దామెరలో విజయ చందర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, దామెర :** బీజేపీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంచార్జి డాక్టర్ విజయ చందర్ రెడ్డి జన్మదిన వేడుకలు దామెర మండలంలో బుధవారం అత్యంత ఉత్సాహభరితంగా జరిగాయి. మండల కేంద్రమైన దుర్గంపేటలోని ఎన్ఎస్ఆర్ హోటల్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఈ వేడుకలను నిర్వహించారు. మండల అధ్యక్షులు వేల్పుల రాజకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా డాక్టర్ విజయ చందర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం పార్టీ నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి, ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో జిల్లా కౌన్సిల్ సభ్యులు పవుడాల మధుకర్, మండల ప్రధాన కార్యదర్శి గండు ముఖేష్, శక్తి కేంద్ర ఇంచార్జి గండు పరశురాం, బూత్ అధ్యక్షులు గండు అన్వేష్, నాయకులు కోరుకొప్పుల ప్రశాంత్, ఇంజపూరి రవి కిరణ్, గడ్డం కార్తీక్, సాంబారి విగ్నేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హిందువులందరూ సంఘటితం కావాలి

- ఘనంగా సమ్మేళన కరపత్రాల ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 17న ఆత్మకూరు మండల కేంద్రంలో భారీ 'హిందూ సమ్మేళనం' నిర్వహించనున్నట్లు ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ ఉప్పునూతుల శంకర్ జీ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో సమ్మేళన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పురాణపీఠం అనంతసాహితీ ఆశ్రమం నుంచి స్వామి అనంతానంద భారతి, ఆర్ఎస్ఎస్ తెలంగాణ సహ ప్రాంత ప్రచారక్ ప్రభు కుమార్, రాష్ట్ర సేవిక సమితి జిల్లా కార్యవాహిక సముద్రాల కవిత హాజరై ప్రసంగిస్తారని వెల్లడించారు. ఆత్మకూరు మండల కేంద్రంతో పాటు కామారం, చౌల్లపల్లి, నీరుకుల్ల, పెంచికలపేట తదితర గ్రామాల నుంచి హిందూ బంధువులు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ సమ్మేళనాన్ని అంగరంగ వైభవంగా విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆత్మకూరు సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు, హిందూ సమ్మేళన సమితి అధ్యక్షుడు టింగిలికారి సత్యనారాయణ, కన్వీనర్ వంగాల బుచ్చిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు కొంకీసు సాంబ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాదం వెంకటేశ్వర్లు, కోశాధికారి నాగబండి శివప్రసాద్, ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవాహ విజయకుమార్, వికాస తరంగిణి ఇంచార్జ్ పోలు రాజేష్ కుమార్, శివాజీ విగ్రహ కమిటీ అధ్యక్షుడు ఎరుకొండ రవీందర్ గౌడ్, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మాతృత్వ భద్రతే సమాజానికి శ్రీరామరక్ష

- ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే నాయిని
- ఘనంగా ప్రగతి ప్రణాళిక - ప్రజా పాలన కార్యక్రమం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా సురక్షిత మాతృత్వ దినోత్సవం బుధవారం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హన్మకొండ లోక్‌సభ సభ్యురాలు కడియం కావ్య, స్థానిక శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. మాతృ మరణాలను తగ్గించడమే కాకుండా, గర్భిణీలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. సురక్షితమైన ప్రసవాలు జరిగేలా అవగాహన కల్పించాలని, మాతృత్వ భద్రతే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్న వసతులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.అప్పయ్య, మహిళా కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, మహిళా ఎస్ఐలు, ఇతర ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## తల్లీబిడ్డల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ సత్య శారద
- ఘనంగా 'సురక్షిత మాతృత్వ దినోత్సవం'
- గర్భిణీలతో మాట్లాడిన ఎమ్మెల్యే, కలెక్టర్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రభుత్వ 'ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా వరంగల్‌లోని ప్రభుత్వ సీకేఎం ప్రసూతి ఆసుపత్రిలో సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో తల్లి ప్రాముఖ్యతను వివరించారు. తల్లి, శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణీలు తీసుకోవలసిన జాగ్రత్తలు, పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి గర్భిణీ సమయానుకూలంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, సురక్షిత ప్రసవం కోసం ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న అత్యాధునిక ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు తల్లీబిడ్డలకు రక్షణగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముందు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ సత్య శారద కలిసి ఆసుపత్రిలోని ఓపీ విభాగం, వివిధ వార్డులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణీలకు అందుతున్న చికిత్స, పారిశుధ్యం, మందుల లభ్యతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న గర్భిణీలతో నేరుగా మాట్లాడి, ఆసుపత్రిలో సేవలు ఎలా అందుతున్నాయో ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వై.వీ.గణేష్, సంధ్యారాణి, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్, జిల్లా వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com